క్లుప్తంగా

జేఈఈ మెయిన్స్‌లో నారాయణ హవా



నెల్లూరు(అర్బన్): జాతీయ స్థాయిలో గురువారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్–2024 ఫలితాల్లో నారాయణ ఐఐటీ అకాడమి విద్యార్థులు అగ్రస్థాయిలో ర్యాంకులు సాధించి హవాను కొనసాగించారని ఆ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. హరనాథపురంలోని నారాయణ కళాశాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యా సంస్థ విద్యార్థులు జాతీయ స్థాయిలో జనరల్ కేటగిరిలో 1వ ర్యాంకుతో పాటు 5,6,7,8,10 ర్యాంకులను సాధించడం సంతోషంగా ఉందన్నారు. తమ అకాడమి విద్యార్థులు జనరల్ కేటగిరిలో షేక్ సూరజ్ 17, లావణ్య చంద్రిక 1028, రితేష్‌రెడ్డి 1269, శ్రీనికేష్ 1475, చరితసుష్మ 1738, సాయినితీష్ 1741, దినేష్‌కార్తీక్ 2418, అభితేష్ 3685, హరిచరణ్‌తేజ్ 4,088, శ్రీరామ్‌సుహాస్ 4,481 ర్యాంకులు సాధించారని వివరించారు. నారాయణ డీన్లు, ఏజీఎంలు, ప్రిన్సిపాల్స్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వసాయి విజయభేరి



నెల్లూరు(అర్బన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశ్వసాయి కళాశాల విద్యార్థులు 71 మందికి పైగా జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి విజయభేరి మోగించారని ఆ కళాశాల చైర్మన్ ఎస్ సత్యనారాయణ తెలిపారు. మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం దివ్యశ్రీ 97.82, వెంకటయశ్వంత్ 97.52 శాతం మార్కులు సాధించారని తెలిపారు. 15 మంది 90 పర్సంటైల్ కన్నా ఎక్కువగా సాధించారని చెప్పారు. జాతీయ స్థాయిలో 2199 ర్యాంకు సాధించిన వై మోహనేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల వైస్‌చైర్మన్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కృష్ణచైతన్య విజయకేతనం



నెల్లూరు(అర్బన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో కృష్ణచైతన్య కళాశాలకు చెందిన ఐన్‌స్టీన్ క్యాంపస్ విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయభేరి మోగించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్ రానాప్రమోద్‌రెడ్డి తెలిపారు. నగరంలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. తమ విద్యార్థులు హర్షవర్ధన్ 374, ప్రతాప్‌నాయుడు 2,054 ర్యాంకులు సాధించారని తెలిపారు. 10వేలలోపు నలుగురు ర్యాంకులు పొందారని చెప్పారు. సూర్యప్రకాష్ 97.41, దివ్యశ్రీ 97.18, జ్యోతిర్మయి 97.07 పర్సంటైల్ సాధించారని తెలిపారు. జూనియర్ కళాశాల డీన్ శిరీష్‌బాబు, అకడమిక్ డీన్ రాంగోపాల్‌రెడ్డి, అడ్మిన్ డీన్ రమేష్, ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవెల్ విద్యార్థుల ప్రతిభ



నెల్లూరు(అర్బన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఓవెల్ విద్యార్థులు ప్రతిభకనబర్చి మంచి ర్యాంకులు సాధించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ రంగిశెట్టి వేణు తెలిపారు. మాగుంట లేఅవుట్‌లోని జూనియర్ కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్పితాసజిత్ 208, వెంకటసంతోష్‌కుమార్ 493, వెంకటనిఖిత్‌బాబు 559, రాకేష్ 1,203, అఖిల్ 3,611, గీతేశ్వర్ 4,219 ర్యాంకులు సాధించారని తెలిపారు. మొత్తం 28 మంది మంచి ర్యాంకులు సాధించారని వివరించారు. ఓవెల్ సీఈఓ ప్రమీల, జీఎం మహదేవ, ఈడీ బాలు, ఏజీఎం గంగాధర్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల సత్తా



నెల్లూరు(అర్బన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తా చాటారని శ్రీచైతన్య కళాశాల నెల్లూరు బ్రాంచ్ డీన్ శ్రీరామ్ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాలలో అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు తనూశ్రీ 99.3 పర్సంటైల్, భానుతేజ 98.27, యజ్ఞశ్రీ 98.13 పర్సంటైల్ సాధించారని తెలిపారు. వివిధ కేటగిరిలలో 5వేలలోపు 14 మంది, 10 వేల లోపు 24 మంది ర్యాంకులు సాధించారని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

మంచి చేసే వారిని ఎన్నుకోండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు మంచి చేసే వారిని పాలకులుగా ఎన్నుకోవాలని వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని పల్లిపాళెం, వడ్డిపాళెం, మాదరాజుగూడూరు, కాకుపల్లి గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ బెదిరింపులు, ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. రానున్న ఐదేళ్లు ప్రజలకు అండగా ఉండే వారిని, రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే వారిని పాలకులుగా ఎన్నుకోవాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబునాయుడి మోసపూరిత హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. ప్రశాంతతకు మారుపేరు అయిన గ్రామాల్లో శాంతియుత పాలన కొనసాగేలా చూస్తామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. మేయర్ స్రవంతి. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, వైఎస్సార్‌సీపీ జాయింట్ సెక్రటరీ వైవీ రామిరెడ్డి, నాయకులు విజయ్‌కుమార్ యాదవ్, మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య, బాబుయాదవ్, వేలూరు శివసునీల్‌రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

మాదిరాజుగూడూరు పంచాయతీలోని వడ్డిపాళెంలో టీడీపీకి చెందిన 30 కుటుంబాలు ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఆదాల పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఉప్పు రామయ్య, ఉప్పు లక్ష్మయ్య, నెల్లూరు శ్రీధర్, నెల్లూరు వెంకటరామయ్య, ఒలిపి పెంచలయ్య, గుంజి కోటేశ్వరరావు నెల్లూరు అంజికుమార్ తదితరులు ఉన్నారు. మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, నాయకులు బెల్లంకొండ నాగభూషణం పాల్గొన్నారు.

చివరి రోజు నామినేషన్ల వెల్లువ



ఖలీల్‌అహ్మద్ తరపున నామినేషన్ అందజేస్తున్న సతీష్ కాండియా

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల సమరంలో తొలి ఘట్టమైన నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారంతో ముగిసింది. చివరిరోజు నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి అత్యధికంగా 16 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ ఒక నామినేషన్ దాఖలు చేయగా, ఖలీల్‌అహ్మద్ తరపున సతీష్ కాడియా మరో నామినేషన్ సెట్‌ను ఆర్వోకు అందజేశారు. టీడీపీ నుంచి 3, సీపీఐ(ఎం) నుంచి 2, జైభీమ్‌రావు భారత్ పార్టీ, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ప్రజా కాంగ్రెస్, ఎస్‌డీపీ నుంచి ఒక్కొక్కటి చొప్పున మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే ఇండిపెండెంట్లుగా మరో ఐదుగురు నామినేషన్లు వేశారు. కాగా ఇప్పటి వరకు నెల్లూరు సిటీ స్థానానికి 26 మంది అభ్యర్థులు 39 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో వికాస్‌మర్మత్ తెలిపారు.

నెల్లూరు రూరల్‌కు 28 నామినేషన్లు దాఖలు

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 13 మంది అభ్యర్థులు 28 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నుంచి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి సునందమ్మ, కాంగ్రెస్ నుంచి షేక్ ఫయాజ్, సోషల్ డెమోక్రటిక్ పార్టీ నుంచి షేక్ మస్తాన్‌వలీ, బీఎస్పీ నుంచి శ్రీరాములు బోడెద్దుల, డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఫాజిల్డ్ రెవల్యూషనరీ సొసైటీ పార్టీ నుంచి అనిల్‌కుమార్ నామినేషన్లు వేశారు. మరో ఐదు మంది స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు అందజేశారు.

సింహపురి పద్య నాటక కళాకారుల సంఘ ఎన్నిక



నెల్లూరు(వేదాయపాళెం): నగరంలోని కొండాయపాళెంగేటు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో జిల్లా పద్య నాటక కళాకారుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింహపురి పద్య నాటక కళాకారుల సంక్షేమ సంఘం పేరుతో నూతన సంఘాన్ని ఏర్పాటు చేసుకుని నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షులుగా చెంచురామయ్య, తిరుపాల్‌రెడ్డి, రామకృష్ణ, ఖాజామస్తాన్‌ను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కొమ్మిరెడ్డి హరనాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వడ్డే చక్రపాణి, జిల్లా ఉపాధ్యక్షులుగా జయరాజు, నజీర్‌బాషా, చెరుకుమూడి భాస్కర్, కార్యదర్శులుగా ఉడతా ప్రభాకర్, సురేష్, మస్తానయ్య, అస్లాం, మహిళా కార్యదర్శులుగా అపరాజిత, భానుమతి, పద్మ, శిరీష ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమానికి పాటు పడతామన్నారు. ప్రజా సమస్యలపై కళారూపాలు ప్రదర్శిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన పలువురు కళాకారులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ

నెల్లూరు(అర్బన్): ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సంతపేటలోని డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి ములుమూడి బస్టాండ్ వరకు గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎంహెచ్ఓ పెంచలయ్య జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ మలేరియాతో ప్రపంచ వ్యాప్తంగా ఏటా లక్షలాది మంది మృత్యువాత పడుతున్నారన్నారు. దోమల నియంత్రణతో పాటు అవి కుట్టకుండా రక్షణ చర్యలు పాటించడం ద్వారా మలేరియాను అరికట్టవచ్చన్నారు. దోమల నియంత్రణతో డెంగీ, చికెన్‌గున్యా, బోధకాలు వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలి, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, డెమో అధికారి శ్రీనివాసరావు, ఏఎంఓ నాగార్జున, సబ్‌యూనిట్ అధికారులు, ఆరోగ్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ఆదాల అడుగులు



ప్రచారం నిర్వహిస్తున్న ఆదాల హిమబిందు



20వ డివిజన్‌లో...



24వ డివిజన్ కల్లూరుపల్లిలో..

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని ఆదాల హిమబిందు పేర్కొన్నారు. గురువారం ఆమె తన తండ్రికి మద్దతుగా 38వ డివిజన్‌లోని అరవింద్‌నగర్, సోమశేఖరపురం, బావిమిట్టపాళెం, తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి రూరల్ నియోజకవర్గాన్ని రూ.వేయి కోట్లతో అభివృద్ధి చేసే ప్రణాళికతో ముందుకెళుతున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన పేద, మధ్యతరగతి ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరిస్తున్నారన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 38వ డివిజన్ కార్పొరేటర్ దాసరి అమృత, పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, ఏపీ స్టేట్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ పాశం శ్రీనివాస్, నగర ఉపాధ్యక్షుడు వేలూరు శ్రీధర్‌రెడ్డి, కొండేటి రఘురాంరెడ్డి, నాయకులు దాసరి రాజేష్, శారద, బషీర్, షెహనాజ్, ఫరీదా, ఉమియా, మల్లిక, జ్యోతిభవాని, అలీం తదితరులు పాల్గొన్నారు.

- 24వ డివిజన్‌లోని కల్లూరుపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లూరి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు నాగరాజు, మురళి, మైథిలి, ఆదిత్య, సుజిత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.
- 20వ డివిజన్ పరిధిలో వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. రూరల్ ప్రాంత అభివృద్ధికి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నాయకులు పోతురాజు రమాదేవి, రాజారెడ్డి, వెంకటరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు



నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని నెల్లూరు చిన్నబజారు, చేజర్ల, కందుకూరు పట్టణం, రూరల్, ఆత్మకూరు స్టేషన్‌ల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో సాయుధ బలగాలతో కలిసి స్థానిక పోలీసు అధికారులు గురువారం కవాతు నిర్వహించారు. మీ రక్షణకు మేమున్నాం..నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు భరోసా కల్పించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేస్తే చర్యలు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడేస్తే చర్యలు తీసుకుంటామని ఎంహెచ్ఓ వెంకటరమణ హెచ్చరించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా నగరంలోని ఇరుగాళమ్మగుడి సెంటర్ ప్రాంతంలో గురువారం ఆయన పర్యటించారు. జొన్నవాడ రోడ్డు వెంబడి వ్యర్థాలను డంప్ చేయడాన్ని గుర్తించి సచివాలయ శానిటేషన్ కార్యదర్శులకు సూచనలు చేశారు. చెత్తను డంప్ చేస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం 14వ డివిజన్ బాలాజీనగర్, గౌడ్ హాస్టల్ సెంటర్‌లో జరుగుతున్న డ్రైనేజీల్లో పూడికతీత పనులను పరిశీలించారు.

ప్రజావైద్యశాల తనిఖీ

ప్రజారోగ్య పరిరక్షణకు మున్సిపల్ కార్పొరేషన్ సూచించిన నిబంధనలను నగరంలోని వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, విద్యా, వైద్య సంస్థలు తప్పనిసరిగా పాటించాలని ఎంహెచ్ఓ వెంకటరమణ సూచించారు. గురువారం ఆయన డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. రోగుల వార్డులు, ఆపరేషన్ గదులు, నర్సింగ్ కళాశాలను పరిశీలించి సౌకర్యాలపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

అప్పు చెల్లించలేదని దాడి చేశారని ఫిర్యాదు

నెల్లూరు సిటీ: ఓ వ్యక్తి వద్ద తీసుకున్న అప్పుతో పాటు వడ్డీని తిరిగి చెల్లించినా ఇంకా నగదు ఇవ్వాలని తనపై దాడి చేశారని నార్తోమైలుకు చెందిన బంకా నాగమ్మ రూరల్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. నార్తోమైలుకు చెందిన బంకా నాగమ్మ కుమారుడు వెంకటేశ్వర్లు విడతల వారీగా రామిరెడ్డి నాగటిబులరెడ్డి వద్ద నగదును అప్పుగా తీసుకున్నారు. కొద్ది నెలలుగా అప్పుతో పాటు వడ్డీ మొత్తం చెల్లించారు. అయినా ఇంకా తనకు డబ్బులు రావాలంటూ ఓబులరెడ్డి, వెంకటసుబ్బమ్మ, విజయ కలిసి ఈ నెల 19వ తేదీన నాగమ్మ ఇంట్లోకి ప్రవేశించి దాడి చేశారు. పార్క్ చేసిన బైక్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై బాధితులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

నెల్లూరు సిటీ: తనపై కొందరు దాడి చేశారని మైపాడు రోడ్డు నార్తోమైలుకు చెందిన పీ సురేష్ గురువారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు..సురేష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. సురేష్ నివసిస్తున్న నార్తోమైలు ప్రాంతంలో తాగునీటి సౌకర్యం లేదు. ఈ క్రమంలో స్థానికులతో కలిసి నగదు వసూలు చేసి మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. అదే ప్రాంతానికి చెందిన సునీల్, వెంకటేశ్వర్లు నగదు ఇవ్వనప్పటికీ స్థానికులు వారికి నీరిచ్చేందుకు అంగీకరించారు. రెండ్రోజుల పాటు తాగునీరు ఇచ్చిన తరువాత ఆ ఇద్దరి ప్రవర్తన సరిగా లేకపోవడంతో కాలనీ వాసులు చర్చించుకుని నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో సునీల్, వెంకటేశ్వర్లు ఈ నెల 3న తాగునీటి పైప్‌లైన్‌ను కత్తిరించారు. సురేష్ అడిగేందుకు వెళ్లగా సునీల్, వెంకటేశ్వర్లుతో పాటు మరికొందరు దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తా



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఖలీల్‌అహ్మద్

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): త్వరలో జరిగే ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. 50వ డివిజన్‌లోని సంతపేట, నాలుగుకాళ్ల మండపం, బొందిలివీధి, కటారిపాళెం, ములుముడి బస్టాండ్, ఖాజీపేట, తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిందన్నారు. గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరడంతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. 2019 ఎన్నికల తరువాత నారాయణ అదృశ్యమయ్యారన్నారు. కరోనా సమయంలోనూ నగర ప్రజలను పట్టించుకోలేదన్నారు. నాలుగున్నరేళ్ల పాటు కనిపించని నారాయణ మళ్లీ ఇప్పుడు ఎన్నికలు వచ్చేసరికి నగరాన్ని తానే అభివృద్ధి చేశానని ప్రచారం చేసుకుంటూ మీ ముందుకు వస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశారని వివరించారు. నగర ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా తనను నేరుగా కలవవచ్చన్నారు. సామాన్యుడినైన తనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క అవకాశం కల్పించారని, తనను ఆశీర్వదిస్తే నగరాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని పేర్కొన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, నెల్లూరు ఎమ్మెల్యేగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ గుంజి జయలక్ష్మి, ఏపీ ఆగ్రోస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదెల సుధీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే నగరాభివృద్ధి



14వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కర్తం



54వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న సఫియా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెల్లూరు నగరం ఎంతో అభివృద్ధి సాధించిందని 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. 14వ డివిజన్‌లో గురువారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సారథ్యంలో నగరంలో సర్వేపల్లి కాలువ, పెన్నా నదికి రిటైనింగ్ వాల్స్, మైపాడు రోడ్డు నాలుగులేన్లుగా విస్తరణ, రామలింగాపురం ఫ్లైఓవర్ వంటి శాశ్వత నిర్మాణాలతో పాటు 32 పాఠశాలలు, 34 పార్కులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రూ.220 కోట్ల విలువైన ఇళ్ల స్థలాలను పేదలకు పంపిణీ చేశారని వివరించారు. నగర సమగ్రాభివృద్ధికి త్వరలో జరిగే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ముస్లిం సమాజం ఆలోచించి ఓటేయాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రానున్న ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తే తమ వర్గానికి మేలు జరుగుతుందో ఆలోచించి ఓటు వేయాల్సిన బాధ్యత ముస్లిం సమాజంపై ఉందని నగర 54వ డివిజన్ కార్పొరేటర్ సఫియాముజీర్ అన్నారు. జనార్దన్‌రెడ్డికాలనీలోని లక్ష్మీపార్వతినగర్‌లో గురువారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీతో టీడీపీ పొత్తుపెట్టుకుని ముస్లిం సమాజానికి తీవ్ర అన్యాయం చేసేందుకు అడుగులు వేస్తోందన్నారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే ముస్లింలకు అమలు చేస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను ఎత్తివేస్తామని పదే పదే ప్రకటనలు చేస్తూ తమ పార్టీ మతతత్వ పార్టీయేనని బీజేపీ రుజువు చేసుకుంటుందని, అలాంటి కూటమిని ఓడించి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మునీర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులను బలి చేసిన బాబు



మాట్లాడుతున్న మల్లి నిర్మల

నెల్లూరు(దర్గామిట్ట): చంద్రబాబు వైఎస్సార్‌సీపీ నుంచి వలస వెళ్లిన వారికి సీట్లు ఇచ్చి టీడీపీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులను బలి చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధి మల్లి నిర్మల అన్నారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి జిల్లా వాసి అని, విద్యాభ్యాసం డిగ్రీ వరకు నెల్లూరులోనే పూర్తి చేశారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు సహాయసహకారాలు అందిస్తున్న వ్యక్తి విజయసాయిరెడ్డి అన్నారు. నాడు టీడీపీ ద్వారా బఫూన్ అయిన వారు నేడు నిస్సిగ్గుగా అదే పార్టీలో చేరడం ఏ పాటిదన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు జిల్లా అభివృద్ధి కనిపించలేదా, టీడీపీలోకి మారగానే జిల్లాలో అభివృద్ధి జరగలేదని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించడం సిగ్గుచేటు అన్నారు. వేమిరెడ్డి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ అక్కున చేర్చుకుని రాజ్యసభ, పార్టీ జిల్లా అధ్యక్ష, టీటీడీ పదవులు ఇచ్చిందన్నారు. కేవలం మైనార్టీకి నెల్లూరు సిటీ అభ్యర్థిగా ప్రకటించడాన్ని జీర్ణించుకోలేక పార్టీని వీడడం ఏ పాటిదన్నారు. తమ నాయకుడు విజయసాయిరెడ్డికి జిల్లా నైసర్గిక స్వరూపం పూర్తిగా తెలుసునన్నారు. జిల్లాలో ఓటు అడిగే హక్కు ఒక్క తమ నాయకుడికి మాత్రమే ఉందన్నారు. జిల్లాలో మరోసారి వైఎస్సార్సీపీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు.

కనులపండువగా రథోత్సవాలు



ఉస్మాన్‌సాహెబ్‌పేటలో కోదండరామస్వామి రథోత్సవం



మూలాపేటలో వేణుగోపాలస్వామి రథోత్సవం



నవాబుపేటలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి రథోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని ప్రధాన ఆలయాల్లో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవాలను కనులపండువగా నిర్వహించారు. మూలాపేటలోని రుక్మిణీసత్యభామా సమేత వేణుగోపాలస్వామి అలయంలో ఉదయం దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి నగరోత్సవం జరిపారు. భక్తులు విశేషంగా పాల్గొని దేవదేవేరులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయకర్తలుగా నూకల సీతమ్మ వీలునామా ప్రకారం పేటేటి రాఘవరావు దంపతులు వ్యవహరించారు. రాత్రి పుష్పక విమానంలో వేణుగోపాలుడు భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తలుగా సాగిరాజు వెంకటరాజు, సునీత దంపతులు వ్యవహరించారు.

- నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి రథోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. దేవస్థానం నుంచి ప్రారంభమైన రథోత్సవం పప్పులవీధిలోని వినాయకస్వామి మందిరం వరకు వెళ్లి తిరిగి దేవస్థానం చేరుకుంది. భక్తులు విశేషంగా పాల్గొని ఆది దంపతులను దర్శించుకున్నారు. ఉభయకర్తగా దివంగత కావలి పుల్లమ్మ శాశ్వత ధర్మాదాయంతో దేవస్థానం వారు వ్యవహరించారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో కోదండరామస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సీతాలక్ష్మణహనుమత్ సమేత కోదండరామస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి నగరోత్సవం జరిపారు. దేవస్థానం నుంచి ప్రారంభమైన రథోత్సవం శ్రీరంగరాజపురం, రేబాలవారివీధి, స్టోన్‌హౌస్‌పేట మెయిన్‌రోడ్డు మీదుగా తడికలబజారుసెంటర్‌కు, అక్కడి నుంచి తిరిగి దేవస్థానం చేరుకుంది. ఉభయకర్తలుగా వంక కైలాసపతి, శ్రీహరిప్రసాద్, సాయిమౌళి కుటుంబసభ్యులు వ్యవహరించారు. రాత్రి తిరుచ్చి ఉత్సవం జరిపారు. ఉభయకర్తలుగా చుండూరు జగన్‌మోహన్‌రావు వ్యవహరించారు.